క్లుప్తంగా

రేణుకా పరమేశ్వరునికి అన్నాభిషేకం



పామర్రు: విజయవాడ రోడ్డులో ఉన్న అంకమ్మతల్లి దేవస్థానంలో ఉన్న రేణుకా పరమేశ్వరునికి జేష్ఠ మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి స్త్రీ సూక్త సహిత విశేషంగా అభిషేకాలు చేశారు. అనంతరం రేణుకా పరమేశ్వర స్వామికి నమక చమకాలతో అభిషేకాలు, పంచామృతాలతో, నవరసాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. మానేపల్లి వెంకటరత్నం, విజయ చంద్రకళ దంపతులు, మానేపల్లి లక్ష్మీ వెంకటేశ్వరరావు భాగ్యలక్ష్మీ దంపతుల సౌజన్యంతో స్వామికి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు స్వామివారి అన్నాభిషేక ప్రసాదాన్ని అన్న ప్రసాదంగా వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వరదా అప్పారావు, కమిటీ సభ్యులు ఉమా మహేశ్వరరావు, మేకా పేరయ్య, కూనపరెడ్డి చెన్నారాయుడు, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10న రాజగోపాలుని కల్యాణం



మండవల్లి: మండలంలోని అల్లినగరంలో కొలువై ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాల స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం, ఆలయ అర్చకులు శరత్‌బాబు, గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి నిధులతో పంట కాలువల మరమ్మతులు



మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పంట కాలువలు సస్యశ్యామలంగా మారి రైతుల సాగునీటి సమస్యలు తీరుతున్నాయని ఎంపీడీఓ ఎస్ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని చావలిపాడులో రూ.74 వేల ఉపాధి నిధులతో 45 మంది కూలీలు శనివారం పంట కాలువ పనులు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కాలువలు అభివృద్ధి చెందడంతో పంట బోదెల ద్వారా పొలాలకు సాగునీరు చేరి రైతులు అధిక దిగుబడులు సాధిస్తారన్నారు.

మానవతా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆపద్కాలంలో తోటివారికి సాయం అందించాలనే మానవతాన్ని ప్రతి ఒక్కరిలోనూ పెంపొందించాలనే లక్ష్యంతో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నిస్వార్థంగా కృషి చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. 2024–25 సంవత్సరానికి గానూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. స్థానిక ఏలూరురోడ్డులోని మానవతా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా విశ్రాంత అధ్యాపకుడు గూడపాటి జయరామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పాబోలు గణేష్‌బాబు, కోశాధికారిగా గంటా ఇందిరాదేవి, ఉపాధ్యక్షుడిగా దయాల ప్రభాకరరావు, సహాయ కార్యదర్శిగా బెజవాడ శ్రీరామ్మూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఉడత కృష్ణమోహన్, రేవిణిశెట్టి సూర్యనారాయణ, గొల్ల మల్లికార్జునరావు, కళ్లేపల్లి నారాయణరావు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో ముఖ్య అతిథిగా విచ్చేసిన మానవతా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. మానవతా ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు పొట్లూరి శేషగిరిరావు, సీనియర్ సభ్యుడు తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అప్రమత్తతే రైతులకు శ్రీరామరక్ష

- తొలకరి ప్రారంభంతో సాగుకు సిద్ధం
- వర్షాలతో పొంచి ఉన్న ప్రమాదాలు గుర్తించాలి
- నివారణ చర్యలు సూచిస్తున్న నిపుణులు





సాగులో భాగంగా అరకతో పొలం దున్నుతున్న రైతు (ఇన్‌సెట్) పొలంలో పిచికారీ చేస్తున్న రైతు

పామర్రు: తొలకరి వర్షాలు పడుతు ఉండటంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తున్నారు. తొలకరి వచ్చిందంటే చాలు రైతన్నలు ఎక్కువ సమయం పొలంలోనే గడుపుతూ ఉంటారు. తీరిక లేకుండా పొలం పనుల్లో నిమగ్నమవుతారు. ముఖ్యంగా వర్షాలు పడే సమయాల్లో కర్షకులు ఎక్కువ ప్రమాదాలకు గురవుతున్నారు. మరణాలు సైతం సంభవించిన సంఘటనలు ఉన్నాయి. వర్షం పడే సమయంలో పిడుగులు, విద్యుదాఘాతాలు, పాములు, ఇలా ఎన్నో విధాలుగా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అందుకే అప్రమత్తంగా ఉంటే చాలా వరకూ ప్రమాదాలకు నివారించవచ్చు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి తదితర వివరాలతో కథనం.

స్టార్టర్లతో జాగ్రత్త

నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలుంటే అందులో తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల్లో అత్యధిక మంది బోర్ల కిందనే వ్యవసాయం చేస్తున్నారు. నియోజకవర్గ మొత్తం మీద సుమారు 6 వేల వరకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. పొలంలో మోటార్లకు ఏర్పాటు చేసిన స్టార్టర్లకు ఎలాంటి రక్షణ ఏర్పాటు చేయటం లేదు. వర్షాకాలంలో ఇది చాలా ప్రమాదకం. చినుకులు స్టార్టర్లపై పడి లోనికి వెళతాయి. ఈ విషయం తెలియక మోటార్లు వేసే క్రమంలో విద్యుత్ ఘాతానికి గురయేయ అవకాశం ఉంది. తగు విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ మధ్య కాలంలో తెగిపడిన విద్యుత్తు తీగల వల్ల చాలా పశువులు చనిపోయాయి. గతంలో మండల పరిధి ఐనంపూడిలో విద్యుత్ వైర్లు తెగి పడి పాడి పశువు మృత్యువాత పడింది. గతేడాదిలో ఒకరిద్దరు వ్యవసాయ కూలీలు కూడా మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. రాత్రి వేళల్లో అవి తెగటం ఉదయం వాటిని గమనించకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చీకట్లో పొలానికి వెళ్లాల్సి వస్తే చేతిలో లైట్లు, కాళ్లకు చెప్పులు వేసుకుంటే మేలు. రైతులు పురుగు మందులు పిచికారి చేసే సమయంలో కనీస జాగ్రత్తలు పాటించకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గాలి వీచే దిశగా పిచికారి చేయాలన్న ప్రాథమిక సూత్రాన్ని కూడా కొంత మంది పాటించడం లేదు. పని త్వరగా పూర్తికావాలన్న తొందరలో చేసే పనులు ప్రాణాపాయానికి దారి తీస్తున్నాయి.

పాములతో ప్రమాదం ఎక్కువే...

వ్యవసాయ పనులకు వెళ్లిన సందర్భాల్లో పాములు, తేళ్ల వంటి విష పురుగుల వల్ల ప్రమాదాలు అధికంగా ఉంటాయి. గత సీజన్‌లో పాము కాటుకు ఓ వ్యవసాయకూలీ కంచర్లవానిపురంలో మృతి చెందారు. నియోజకవర్గంలో మొత్తం మీద నలుగురు మృత్యువాత పడినట్లు పోలీసు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఒక వేళ ఏదైనా కాటేసినట్లు అనుమానం ఉంటే సొంత వైద్యం చేయకుండా సమీపంలోనే వైద్యుడి వద్ద ప్రథమ చికిత్స చేయించుకుంటే మేలు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

విద్యుత్ మోటార్లు తడవకుండా కప్పు ఉండేలా ఏర్పాట్లు చేయాలి. తడిచినట్లు ఏ మాత్రం అనుమాన వచ్చినా చేతితో పట్టుకోవద్దు. పూర్తిగా ఎండిపోయే వరకు ఆగాలి. టెస్టర్లు ఉంచుకొని అనుమానం వస్తే పరీక్షించుకోవాలి. మరమ్మతులు అవసరమైతే నిపుణులను పిలిపించుకుకోవడం అవసరం. సర్వీసు తీగలో అతుకులు లేకుండా చూసుకోవాలి. అతుకులు ఉంటే వర్షానికి తడిసి విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది.

-ఏడీఏ స్వర్ణలత , పామర్రు

తొడుగులు ధరించాలి

రైతులు పురుగు మందులను గాలికి వ్యతిరేక దిశలో పిచికారీ చేయకూడదు. పూర్తి స్థాయిలో దుస్తులు ధరించాలి. ఎరువు రంగున్న పురుగు మందులు అత్యంత ప్రమాదకరంగా గుర్తించాలి. మందులు పిచికారీ చేసే సమయంలో చేతులకు తొడుగులు ధరించాలి. నోటికి ముక్కుకు, మాస్కులు వాడాలి. పిచికారీ తరువాత డబ్బాలను వేడి నీటితో శుభ్రం చేయాలి. చేతులను ఒకటికి రెండు సార్లు వేడి నీటితో శుభ్రం చేసుకోవాలి. అలవాటు ఉన్నవారే పురుగు మందుల పిచికారీ చేయడం ఉత్తమం.

– శివ నాగరాణి, వ్యవసాయాధికారి, పామర్రు

ఇవి పాటిస్తే మేలు

వ్యవసాయ పనుల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే పిడుగుల పడే అవకాశం ఉన్నప్పుడు ఆ సమయంలో చెట్ల కిందకు చేరకూడదు. భూమి పైన కూర్చోవాలి. లేదంటే పడుకోవాలి. పిడుగుపాటుకు గురైన వారికి వెంటనే వైద్యుడిని సంప్రదించి సకాలంలో వైద్యం అందించాలి. విష పురుగుల కాటుకు గురైనవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి విరుగుడు ఇంజక్షన్ చేయించుకోవాలి. నాటు వైద్యం చేయించుకుని ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచిస్తున్నారు.

– సుధారాణి, వైద్యాధికారి, పామర్రు

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి

గుడివాడరూరల్: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. పట్టణంలోని జగన్నాథపురంలో వేంచేసియున్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్‌తో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడివాడతో పాటు రాష్ట్రంలో టీడీపీ గెలవడంతో మొక్కులు చెల్లించారు. తొలుత ఎమ్మెల్యే రాముకు దేవదాయ అధికారులు ఘన స్వాగతం పలికి స్వామివారి పట్టువస్త్రాలు సమర్పించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడులవాడగా ప్రసిద్ధి చెందిన గుడివాడలో విశిష్టత కలిగిన వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గుడివాడలో దేవాలయాల వైభవాన్ని మరింత పెంపొందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలు నిర్వహించడంలో స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. స్వామివారి కృపతో పాడి పంటలు బాగా వృద్ధి చెంది ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే రాము కోరారు. అనంతరం 31వార్డు టీడీపీ నేతల సహకారంతో దేవస్థానంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో షణ్ముఖ నటరాజన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యెర్నేని సీతాదేవి సేవలు చిరస్మరణీయం



కొండూరులో జరిగిన సంతాప సభలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితర నాయకులు

కైకలూరు: ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో మాజీ మంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి (74) సంతాప సభ స్వగ్రామం కలిదిండి మండలం కొండూరు గ్రామంలో శనివారం జరిగింది. గుండెపోటుతో ఆమె గత నెల 27న హైదరాబాద్, మాదాపూర్ డివిజన్ పరిధి వసంత సిటీలోని తన నివాసంలో మృతి చెందిన విషయం విదితమే. గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ముదినేపల్లి నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా సీతాదేవి గెలిచి, ఎన్టీ రామారావు పాలనలో ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, విద్యాశాఖామంత్రిగా విధులు నిర్వహించారన్నారు. ఆమె భర్త దివంగత నాగేంద్రనాథ్ రైతాంగ సమాఖ్య, కొల్లేరు పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులుగా అనేక సేవలు అందించారని తెలిపారు. ఇద్దరితో తమకున్న సాన్నిహిత్యాన్ని పంచుకున్నారు. సంతాప సభకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం, కృష్ణా జిల్లా జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ తాతినేని పద్మావతి, పలువురు రైతాంగ పోరాట నాయకులు, సీతాదేవి కుమారులు వెంకట నాగేశ్వరరావు, మురారి, కుమార్తె రాజా వాసిరెడ్డి హంసిని, కుంటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వానరాలను అరికట్టండి మహాప్రభో !



గ్రామంలోని రహదార్లపై తిరుగుతున్న కోతుల సమూహం

పామర్రు:మండల పరిధిలోని పలు గ్రామాల్లో వానరాలు మూకలుగా ఏర్పడి ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. జమీదగ్గుమిల్లి, రాపర్ల గ్రామాల్లో పెద్ద సంఖ్యలో కోతులు గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇళ్ల పైకి ఎక్కి రేకులను పగలగొట్టడం, ఇళ్లలోకి దూరి ఇంట్లోని వస్తువులు, తినుబండారాలు ఎత్తుకు పోతున్నాయి. ఎవ్వరైనా అదిరించాలని ప్రయతిస్తే వారిపై తిరగబడుతున్నాయి. దీంతో గ్రామస్తులు భయపడుతున్నారు. గ్రామానికి చెందిన కాకర్ల వెంకటేశ్వరరావు, కందుల గోవిందు అనే ఇద్దరిని కోతులు కరిచి గాయ పర్చాయి. వారు స్థానిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రహదార్లపై యథేచ్ఛగా తిరుగు తూ వెళ్లే వారి వద్ద ఉన్న వస్తువులను లాక్కుని పారిపోతున్నాయి. దీనితో స్థానికంగా ఉండే ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతులను గ్రామం నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

శాంతిభద్రతలు అదుపులో ఉంచాలి



ఎమ్మెల్యే కుమార్‌రాజాను మర్యాద పూర్వకంగా కలిసిన పోలీస్ అధికారులు

పామర్రు: నియోజకవర్గంలోని ప్రజలు సుఖ శాంతులతో ఉండే విధంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా శాంతి భద్రతలు అదుపులో ఉండేలా పోలీస్ శాఖ పని చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో పోలీస్ శాఖ అధికారులు ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని తర్వాత అందరూ కూడా కలిసి కట్టుగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు విధమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు సత్వర న్యాయం జరిగే విధంగా అందరూ పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, పామర్రు సీఐ సుభాకర్, పామర్రు ఎస్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

రామోజీరావు సేవలు మరువలేం



యాకమూరులో రామోజీరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

తోట్లవల్లూరు: తెలుగు పత్రిక, సినీ రంగాలకు చెరుకూరి రామోజీరావు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని యాకమూరులో ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్, దివంగత చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి ఆయన శనివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన కూడా రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. యాకమూరులో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకురాలు చదలవాడ ఏసుమరియమ్మ కుటుంబసభ్యులను కుమార్‌రాజా, కల్పన పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్, కార్యదర్శి లుక్కా రేణుకారావు, జనసేన మండల అధ్యక్షుడు శనివారపు కృష్ణమన్, బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్, నాయకులు చొప్పరపు నాగసుబ్రహ్మణ్యం, వీరంకి పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



ప్రమాదభరితంగా గన్నవరం తరుగుమూల మలుపు



కొర్లపాడు వద్ద అత్యంత ప్రమాదకరంగా ఉన్న మలుపు

మండవల్లి: మండల కేంద్రం సమీప గ్రామాలైన గన్నవరం తరుగుమూల, కొర్లపాడు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారుల మలుపులు ప్రమాదభరితంగా మారాయి. వాహన చోదకులు గుడివాడ–భీమవరం మార్గంలో ఉన్న ఈ మలుపుల వద్ద ఏ మాత్రం ఆదమరిచి ఉన్నా ప్రమాదానికి గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గన్నవరం వెళ్లే మలుపు ఎల్ ఆకారంలో ఉండి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఆదమరిస్తే ఎదురు బొదురు వాహనాలు ఒకదానిని మరొకటి ఢీకొని పక్కనే ఉన్న నీటి కొలనులో దూసుకెళుతున్నాయి. ఈ కొలను రహదారి పొడవునా సుమారు ఒకటిన్నర కిలో మీటర మేర ఉంది. ఎక్కువగా తెల్లవారుజామున ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

గన్నవరం తరుగుమూల నుంచి సుమారు కిలో మీటరు దూరంలో కొర్లపాడు మలుపు ఉంది. గతంలో ఇక్కడ గుడివాడ వైపు వెళ్లే లారీ అదుపుతప్పి ఒక ఇంట్లోకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించడంతో మలుపులు లేకుండా వేరే రహదారి మార్గాన్ని అధికారులు ప్రారంభించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వేదికపై సాయంత్రం ఆరు గంటలకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ తప్పక విచ్చేసి విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతిపై కేసు నమోదు

తోట్లవల్లూరు: కడుపునొప్పి తాళలేక వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చాగంటిపాడులో జరిగింది. గ్రామానికి చెందిన మర్రెడ్డి యామిని(26) ఈ నెల 2న కడుపునొప్పి తాళలేక పురుగుల మందు సేవించింది. మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె ఈ నెల 5న మృతి చెందింది. మృతురాలి తండ్రి అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. విశ్వనాథ్ తెలిపారు. మృతురాలికి భర్త చైతన్యకుమార్‌రెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నట్లు ఆయన తెలిపారు.

రహదారి అభివృద్ధి చేయరూ !

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలో రెండు ప్రధాన మండలాలను కలిపే పంచాయతీరాజ్ రహదారిని అభివృద్ధి చేయాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు. ముదినేపల్లి మండలంలోని చినకామనపూడి నుంచి మండవల్లి మండలం లింగాల 65వ నంబర్ జాతీయ రహదారి వరకు 3 కిలోమీటర్ల పొడవున పంచాయతీరాజ్ రోడ్డు ఉన్నది. ఈ రోడ్డు ద్వారా బంటుమిల్లి, ముదినేపల్లి మండలాల్లోని పలు గ్రామాల నుంచి అనేక వాహనాలపై కైకలూరు వెళుతుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రహదారి చినకామనపూడి నుంచి లింగాల సరిహద్దు వరకు ఆసాంతం దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఏమాత్రం అనువుగా లేదు. గత కొన్నేళ్లుగా ఈ రహదారి ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో దీని పరిస్థితి రోజురోజుకు మరింత దిగజారుతోంది. ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోతూ ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్విచక్ర వాహనాలు సైతం ప్రయాణించేందుకు ఏమాత్రం అనువుగా లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. సంబంధిత అధికారులు ఇకనైనా శ్రద్ధ చూపి రహదారి అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏఎస్ఐ బైక్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరులో ట్రాఫిక్ ఏఎస్ఐగా పని చేస్తున్న యారంశెట్టి భగవతి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు ట్రాఫిక్ ఏఎస్ఐగా పని చేస్తున్న భగవతి విధులు ముగించుకుని తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేశాడు. గుర్తు తెలియని దొంగలు బైక్‌ను చోరీ చేశారు. ఈ ఘటనపై ఏఎస్ఐ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బాపూజీపేటలో సంబరాలు



బాపూజీ పేటలో కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పామర్రు: సార్వత్రిక ఎన్నికలలో ఘన విజయం సాధించిన కూటమి అభ్యర్థి వర్లకుమార్ రాజాకు స్థానిక బాపూజీ పేటలో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి నుంచి డప్పు వాయిద్యాలతో టపాసుల కాల్పులతో అంగరంగ వైభవంగా వర్లకుమార్ రాజాను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్‌రాజా మాట్లాడుతూ స్థానికులు తనను ఎంతో మెజార్టీతో గెలిపించారని దీనికి మీకు ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. రానున్న కాలంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం వర్లకుమార్ రాజాతో విజయోత్సవ కేక్‌ను కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, పార్టీ నాయకులు వల్లూరు పల్లి గణేష్, పామర్తి విజయ్‌శేఖర్, కుదరవల్లి ప్రవీణ్‌కుమార్, వీరంకి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు వేళాయే..



ముస్తాబైన కల్యాణ వెంకటేశ్వరుడి ఆలయం

- ఈ నెల 17 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ముస్తాబవుతున్న శ్రీవారి ఆలయం



శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరుడు

కోడూరు: దివిసీమలో ప్రసిద్ధి గాంచిన కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 17న ఉదయం 10 గంటలకు స్వామివార్లకు అష్టోతర శతకలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించి, సాయంత్రం 5గంటలకు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. అదే రోజు రాత్రికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, సంతానము కోరే మహిళలకు గరుడ ప్రసాదమును అందించనున్నట్లు తెలిపారు. 18న ఉదయం హోమాలు, శతకలశ క్షీరాభిషేకం, రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎదురుకోలోత్సవం, 19న ఉదయం కౌతుకోత్సవం, నవ కలశస్నపన, రాత్రి స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న గరుడ, శేషవాహనాలపై స్వామివారి తిరువీధి ఉత్సవం, 21న అవభృదస్నానం, మహాపూర్ణాహుతి,, ద్వజాఅవరోహణ, 22న శాంతి కల్యాణం, శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలను ముగించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ తెలిపారు. 23న శ్రీవారి మహా అన్నసమారాధనను నిర్వహించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ చెప్పారు. శ్రీవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.